గ్రామ కమిటీ అభివృద్ధికి కృషి


భవానీశంకర్

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడ గ్రామ కమిటీకి ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడు చెరుకు భవానీ శంకర్, ఉపాధ్యక్షులు మిట్టు మురళి, కోశాధికారిగా సుర్వి జగదీష్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రుద్రగోని పాండుగౌడ్, జాయింట్ ఆర్గనైజర్ సెక్రటరీ వస్తం రాజేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు గుండగోని రాముగౌడ్, వస్తం నాగేశ్వర్‌రావు గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. బండ్లగూడ గ్రామ కమిటీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



నాగోలు: విద్యార్థులను క్రీడాల్లోనూ ప్రోత్సహించాలని కొత్తపేట డివిజన కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శ్రీ రామలింగేశ్వర కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన యూరో కిడ్స్ ప్లే స్కూల్‌ను ఆదివారం ఆయన చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం జోష్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారంలో పాల్గొన్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేస్–2 హుడా కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.ఆనంద్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా కే.సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీలోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం కమిటీ అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో జరిగిన కార్యవర్గంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌గౌడ్, సంజయ్‌కుమార్, వేములయ్య గౌడ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం అభిషేకం, ఆరాధన, తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషిచేస్తా


నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జిగా చిలుక నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, గిట్టుబాటు ధరల కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చెకొలేకర్ లక్ష్మి, మార్కెట్ పాలకవర్గం, వ్యాపారులు అభినందనలు తెలిపారు.

వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శాంతినికేతన్ మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనాథలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సామాజిక కార్యకర్త చూపూర శంకర్ అన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన రామకృష్ణ, సుజాత దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ డైరెక్టర్ బాలేశ్వర్, సొసైటీ సభ్యులు సునిత, సందీప్, హాస్టల్ వార్డెన్ సత్తార్ పాల్గొన్నారు,


బండ్లగూడ రేషన్ షాపు వద్ద బారులుతీరిన దృశ్యం

బియ్యం పంపిణీ @ సర్వర్‌డౌన్

మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ గందరగోళంగా మారింది. ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో ఆదివారం ఉదయం నుంచే లబ్ధిదారులు ఆయా రేషన్ దుకాణాల వద్ద బారులుతీరారు. సర్వర్ సమస్య తలెత్తడంతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కొక్కరికి దాదాపు 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతుండటంతో కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇళ్లకు వెళ్లిపోయారు. మలక్‌పేట్‌లోని కొన్ని దుకాణాల వద్ద లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వర్‌డౌన్‌తో ఆర్‌కేపురం డివిజన్‌లోని దుకాణాలను మూసివేశారు. మలక్‌పేట్‌లో పలు దుకాణాలను ఏఎస్‌ఓ నర్సింగరాజు పరిశీలించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సాంకేతిక సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులందరికీ మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తామన్నారు. – ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


సర్వర్ సమస్యతో వేలిముద్రల కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు


మలక్‌పేట్‌లో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎఎస్‌ఓ నర్సింగరాజు


మూసారంబాగ్‌లో..

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు అనుమతికి వినతి

దిల్‌సుఖ్‌నగర్: కొండా లక్ష్మణ్ బాపూజీ 25 అడుగుల కాంస్య విగ్రహాన్ని కొత్తపేటలో ప్రతిష్ఠించేందుకు అనుమతి నిమిత్తం ఎల్‌బీనగర్ పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ నాయకులు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు కలిసి వినతిపత్ర అందజేశారు. విగ్రహం ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వ పరంగా సహకారం ఉంటుందని మంత్రి సూచించినట్లు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో ట్రస్ట్ చైర్మన్ పున్న గణేష్ నేత, వైస్ చైర్మన్ కౌకుంట్ల రవి తేజ, గుర్రం శ్రావణ్, పడాల రవీందర్, జెల్లా సూర్యకాంత్, తలాటి రమేష్, కోశాధికారి జెల్లా జగన్నాథం, రాపోలు సుధాకర్, నారని రవీందర్, చేరిపల్లి ప్రభాకర్ ఉన్నారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ట్రస్ట్ సభ్యులు

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..
టమాటా రూ.15, వంకాయ రూ.25, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.55, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.37, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.15, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.75, చామగడ్డ రూ.33, మునగ రూ.55.

అసంపూర్తి పనులతో అవస్థలు


అసంపూర్తిగా వాకింగ్ పాత్


పార్కులో పేరుకుపోయిన వ్యర్థాలు

మలక్‌పేట: పార్కుల్లో సకల సౌకర్యాలు, ఆహ్లాదకర వాతవరణం కల్పించాల్సిన అధికారులు అసంపూర్తి పనులతో సరిపెడుతున్నారు. రూ.లక్షల్లో ప్రజాధనం ఖర్చు చేస్తున్నా పూర్తిస్థాయిలో వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్కులో ఈ ఏడాది జనవరి 2న స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అభివృద్ధి పనులు ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్ పార్కులో కేవలం పాడైన వాకింగ్ పాత్ తొలగించి కొత్తది వేశారు. తొలగించిన పాత వాకింగ్ పాత్ వ్యర్థాలు ఎక్కడి అక్కడే వదిలేయడంతో మట్టికుప్పలు, వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. అసంపూర్తి వాకింగ్‌పాత్ పనులతో నడవడానికి ఇబ్బందిగా మారిందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణ కొరవడి కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కులో పచ్చదనం కరువైంది. మొక్కల సంరక్షణ లేదని, పిల్లల ఆటస్థలం అభివృద్ధికి నోచుకోలేదని పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీ కమ్యూనిటీహాల్లో నేత్రాలయ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. శిబిరంలో పాల్గొన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, శ్రీనేత్రాలయ కంటి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న వినోద్‌రెడ్డి

ఓపెన్ నాలాను భూగర్భ డ్రైనేజీగా నిర్మించాలని వినతి

మీర్‌పేట: ఓపెన్ నాలాను భూగర్భ డ్రైనేజీ లైన్‌గా నిర్మించాలని జిల్లెలగూడ ఓంసాయి కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని ఓపెన్ నాలాతో కొన్నేళ్లుగా తీవ్ర అవస్థలు పడుతున్నామని, రానున్న వర్షాకాలం దృష్ట్యా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నాలా స్థానంలో పైపులైన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్, కాలనీవాసులు విజయ్, కిషోర్, ధారల శ్రీధర్, కుమార్‌శెట్టి, రోజెకర్ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

చాదర్‌ఘాట్: మలక్‌పేట అక్బర్‌ప్లాజా వద్ద జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు చేపట్టిన మరమ్మతు పనులను ఆదివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ పరిశీలించారు. మలక్‌పేటలో ట్రాఫిక్ జామ్ నివారణకు రాత్రి సమయంలో చేపడుతున్న డ్రైనేజీ పనుల పురోగతిని పరిశీలించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ట్రాఫిక్ ఆంక్షల పొడిగింపు

మలక్‌పేట అక్బర్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై డ్రైనేజీ మరమ్మతు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలను పొడిగిస్తున్నట్లు నగర్ ట్రాఫిక్ పోలీసుల విభాగం జాయింట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు మరమ్మతు చేస్తున్న నేపథ్యంలో మొదట శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అయితే ఆ ఆంక్షలు సోమవారం తెల్లవారుజాము 6 గంటల వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు.


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ పరిధి వాసవికాలనీలోని ఆర్యవైశ్య భవనంలో లైట్ సంస్థ ఆధ్వర్యంలో లిటిల్ బుద్ధ చిల్డ్రన్స్ క్లబ్, సరస్వతి ట్రస్ట్, సైకి మానసిక (బుద్ధి మాంద్యం) స్కూల్ డైరెక్టర్ శ్యామల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సరస్వతి చిల్డ్రన్స్ క్లబ్' బాలబాలికల వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, రవీందర్, మురళీధర్, కృష్ణకుమార్, సంతోషి, సర్వలక్ష్మి పాల్గొన్నారు.

అహల్యాబాయి సేవలు మరువలేనివి

నాగోలు: మనదేశంలో ఎన్నో దేవాలయాలు నిర్మించిన అహల్యాబాయి హోల్కర్ మహిళలకు స్ఫూర్తిదాయకమని బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు లయ కాలంశెట్టి అన్నారు. అహల్యా బాయి జయంతిని పురస్కరించుకుని నాగోలు బండ్లగూడలోని ఇంద్రప్రస్థ కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా లయ కాలంశెట్టి మాట్లాడుతూ.. అహల్యా బాయి హోల్కర్ పరిపాలనలో ప్రజలు సుభిక్ష వాతావరణంలో ఉండేవారని, హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల నిర్మాణ పునరుద్ధరణకు ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

కమ్యూనిటీ హోళ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లో నివసించే వారు చిన్నపాటి శుభకార్యాలు నిర్వహించుకోవటానికి కమ్యూనిటీ హాళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నీలం రాజశేఖర్‌రెడ్డినగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులను ఆమె బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీలు అన్నింటిలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నీలం రాజశేఖర్‌రెడ్డి నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉందని ఈ విషయాన్ని బస్తీవాసులు తన దృష్టికి తీసుకు రావటంతో అధికారులతో చర్చించి పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు కృష్ణ, రఘుపతి, శేఖర్, మహేష్, రవి, నాగరాజు, వినోద్, శ్రీశైలం, రేణుక పాల్గొన్నారు.


కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభించిన శ్వేతామధుకర్‌రెడ్డి

6న కుర్తాళం ఉత్తర పీఠాధిపతి పట్టాభిషేకం

నాగోలు: కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతిగా శ్రీ దత్తేశ్వరానంద భారతి స్వామి నియమితులయ్యారని, వారి పట్టాభిషేక మహోత్సవం తమిళనాడులోని కుర్తాళంలో ఈ నెల 6వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ సిద్ధేశ్వరి పీఠం తెలంగాణ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. పీఠ పురోహితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో జూన్ 2 నుండి 6 వరకు జరిగే కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్రంలోని భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.